సాక్షి
విజయనగరం

గురువారం । 19 । డిసెంబర్ । 2024



నిరుద్యోగులపై కక్ష తగునా..!

గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి నిరుద్యోగులకు అన్యాయం చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. - 8లో



మాంగనీస్ అక్రమ తవ్వకాలపై దాడులు

గార్రాజు చీపురుపల్లి గ్రామ పరిసర ప్రాంతాలో మాంగనీస్ తవ్వకాలపై మైన్స్ అధికారులు దాడులు చేశారు. - 8లో



యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి - 8లో

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు.

న్యూస్‌రీల్

విజయనగరం కార్పొరేషన్‌కు అవార్డు

విజయనగరం: ఇంధన పొదుపులో విజయగనరం మున్సిపల్ కార్పొరేషన్ అవార్డును సొంతం చేసుకుంది. స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–24 పేరిట ఆంధ్రప్రదేశ్ ఇంధన పొదుపు మిషన్ ఇచ్చే అవార్డుల్లో విజయనగరం కార్పొరేషన్ సిల్వర్ అవార్డును దక్కించుకుంది. ఈ నెల 20న విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డును అందుకునేందుకు రావాలని కమిషనర్‌కు పిలుపు అందింది. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, నగర పంచాయతీలు పోటీ పడగా... విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు సిల్వర్ అవార్డు దక్కడం విశేషం. ఇటీవల ప్రధానమంత్రి స్వానిధి యోజన పథకం అమల్లో గుర్తింపు పొందిన విజయనగరం కార్పొరేషన్‌కు మరో అవార్డు వరించడంపై అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


భక్తి శ్రద్ధలతో కాకడ హారతి



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కాకడ హారతి

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజారులు కాకడ హారతితో ఆలయ ప్రదక్షిణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

21న సాగునీటి ప్రాజెక్టు కమిటీల చైర్మన్ ఎన్నిక



విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ఐదు సాగునీటి ప్రాజెక్టు కమిటీలకు ఈ నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. డెంకాడ ఆయకట్టు సిస్టం, ఆంధ్ర రిజర్వాయర్, తాటిపూడి రిజర్వాయర్, పారాది ఆయకట్టు, గొర్లె శ్రీరాములు నాయుడు ప్రాజెక్టు స్టేట్–1లకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12:30 గంటల వరకు జరిగే ఎన్నికల ప్రక్రియలో ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొని ప్రాజెక్టు కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు.

నాయకుడంటే.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. హామీని ఆచరణలో చూపాలి. జనానికి మార్గదర్శకంగా ఉండాలి. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండాలి. టీడీపీ కూటమి నేతల తీరు చూస్తే ఇవేవీ సరిపోలడంలేదు. మాట ఇవ్వడం.. మరిచిపోవడం, ప్రజలను మోసం చేయడం వారికి అలవాటుగా మారింది. దీనికి గుర్ల డయేరియా బాధితులకు ఆపన్నహస్తం అందించడంలో అలసత్వమే నిలువెత్తు నిదర్శనం. సీఎం చంద్రబాబు ఆదుకుంటారన్న నమ్మకం లేకపోయినా.. కనీసం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారా.. పొల్లుగానే మిగుల్చుతారా అన్న చర్చ ప్రస్తుతం జిల్లాలో జోరందుకుంది.



గుర్ల డయేరియా బాధితులను పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ (ఫైల్)

పవన్ మాట పొల్లేనా?

- గుర్ల డయేరియా మృతుల కుటుంబాలకు సర్కారు మొండిచేయి!
- పది మంది మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం చేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్ హామీ
- రెండు నెలలవుతున్నా హామీ, అభయంపై నోరుమెదపని వైనం
- ఇచ్చిన మాట ప్రకారం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాయం
- రూ.2 లక్షల చొప్పున 13 కుటుంబాలకు ఆర్థిక సాయం
- త్వరలోనే ఉమ్మడి విజయనగరం జిల్లాకు రానున్న పవన్?
- ఇప్పటికైనా ఎక్స్‌గ్రేషియా ఇస్తారో లేదోనని బాధిత కుటుంబాల ఎదురుచూపు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గుర్ల డయేరియా మృతుల కుటుంబాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి ఇప్పటికీ చిన్నచూపే! జిల్లా కేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుర్ల మండలాన్ని రెండు నెలల కిందట డయేరియా వణికించిన సంగతి తెలిసిందే. 250 మందికి పైగా ఈ వ్యాధి బారినపడ్డారు. 13 మంది రెండు వారాల వ్యవధిలోనే పిట్టల్లా రాలిపోయారు. తల్లి మృతిని తట్టుకోలేక మనోవేదనతో మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఒకే ప్రాంతంలో, స్వల్ప కాల వ్యవధిలో ఇంతమంది చనిపోయినా సర్కారులో స్పందన తూతూమంత్రమే. కంటితుడుపు చర్యగా అక్టోబర్ నెల 21వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్లలో పర్యటించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. డయేరియా ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులనూ పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష పెట్టారు. ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ నివేదిక ఇచ్చిన వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని చెప్పారు. అది ఆలస్యమైతే వెంటనే తన సొంత నిధుల నుంచి రూ.లక్ష చొప్పున పది మంది కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తానని పవన్ ప్రకటించారు. ఆహా ఓహో అని కూటమి నాయకుల చప్పట్లు ఇంకా బాధిత కుటుంబాల చెవుల్లో రింగ్‌మంటూనే ఉన్నాయి. ఆయన వెళ్లిన రెండ్రోజులకే జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోంమంత్రి వంగలపూడి అనిత కూడా మొక్కుబడి తంతుగా వచ్చివెళ్లారు. ఇంత హడావుడి చేసినా డయేరియా బాధిత కుటుంబాలకు మాత్రం ఊరట లభించలేదు. దాదాపు రెండు నెలలవుతున్నా ఆ పది కుటుంబాలకు పవన్ ప్రకటించిన రూ.లక్ష సాయం అందలేదు. కూటమి సర్కారు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఊసూలేదు.

ఇచ్చిన మాట ప్రకారం..



మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పంపించిన చెక్కులను గుర్లలో డయేరియా బాధితులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు (ఫైల్)

మాటలు కాదు చేతల్లో చూపించే జననాయకుడని ప్రతిపక్షనేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి డయేరియా బాధిత కుటుంబాల గుండెల్లో నిలిచిపోయారు. ఆయన అక్టోబర్ 24న గుర్లలో పర్యటించినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం 13 మంది మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేశారు. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తేసిన వెంటనే గత నెలలోనే శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆయా కుటుంబాలకు అందించిన సంగతి తెలిసిందే.

కన్నెత్తి చూడని చంద్రబాబు..

డయేరియా ఒక్క గుర్ల మండలంలోనే 13 మంది బలిగొన్నా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. విజయానంద్ కమిటీ నివేదికకు అతీగతీ లేదు. మృతుల కుటుంబాలకు కనీసం ఎక్స్‌గ్రేషియా గురించి ఒక్క ప్రకటనా చేయలేదు. సరికదా... ఇటీవల జిల్లా కలెక్టర్ల రెండ్రోజుల సమావేశంలో సరికొత్త పల్లవి ఎత్తుకున్నారు. జిల్లా అధికార యంత్రాంగం పాలనా వైఫల్యం, అసమర్థత వల్లే అతిసార (డయేరియా) ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయంటూ నెపం అధికారులపై నెట్టేశారు. వారంతా ప్రభుత్వంలో భాగమే అన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించి, తప్పు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇక ఆశలన్నీ పవన్‌పైనే....

జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పైనే బాధిత కుటుంబాలు ఆశలు పెట్టుకున్నాయి. ఆయన ఉమ్మడి విజయనగరం జిల్లా పర్యటనకు వస్తున్నారు.. అదిగో ఇదిగో అని కూటమి నాయకులు హడావిడి చేస్తున్న నేపథ్యంలో ఎక్స్‌గ్రేషియాపై చర్చ సాగుతోంది. ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష అయినా ఇస్తారా? లేదా ప్రభుత్వంతో మాట్లాడి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అయినా ఇప్పిస్తారా? అనే ఆశతో ఉన్నారు. ఏం చేస్తారో, ఏం చెబుతారో వేచిచూడాలి.

రెండు నెలలవుతోంది...



పవన్ కళ్యాణ్ గుర్ల వచ్చారు. మాతో మాట్లాడారు. డయేరియా ఎలా వచ్చిందని అడిగారు. ప్రభుత్వంతో మాట్లాడి అంతా తాను చూస్తానని చెప్పారు. సొంతంగా లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేస్తానన్నారు. సుమారుగా రెండు నెలలు అవుతోంది. ఇంకా ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కనీసం సమాచారం కూడా లేదు.

– పతివాడ శ్రీనివాసరావు, గుర్ల, మృతురాలు పతివాడ సూరమ్మ కుమారుడు

ప్రకటించారే తప్ప పైసా ఇవ్వలేదు



డయేరియాతో నా భర్త చనిపోయాడు. పవన్ కళ్యాణ్, మంత్రి అనిత మా కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామన్నారు. తీరా రెండు నెలలైనా పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ.లక్ష రాలేదు. ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు.

– చింతపల్లి అప్పయ్యమ్మ , గుర్ల, మృతుడు చింతపల్లి అప్పారావు భార్య

అతీగతీ లేదు



డయేరియాతో భార్య చనిపోయింది. పవన్ కళ్యాణ్ మా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రూ.లక్ష ఆర్థిక సాయం కూడా చేస్తామన్నారు. జనసేన పార్టీవారు వచ్చి ఆధార్ కార్డులు తీసుకున్నారు తప్ప నేటికీ అతీగతీ లేదు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లుగానే రూ.2 లక్షల చొప్పున సాయం అందించారు.

– తోండ్రంగి అప్పారావు, గుర్ల, మృతురాలు తోండ్రంగి రాము భర్త

సందడి చేసిన శ్రీలీల..

- చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీనటి
- శ్రీలీలను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు



చెన్నయ్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల

విజయనగరం టౌన్: విద్యలనగరంలో సినీనటి శ్రీలీల బుధవారం సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. అందులోని పట్టు, ఫ్యాన్సీ చీరలు, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, బంగారు, డైమెండ్ ఆభరణాలను పరిశీలించారు. షాపింగ్‌మాల్ యజమానులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ షాపింగ్ అంటే చాలా ఇష్టమన్నారు. చీరలపై ఎక్కువగా మక్కువచూపుతానని చెప్పారు. అన్నివర్గాల వారికి అందుబాటు ధరల్లోనే చెన్నయ్ షాపింగ్‌మాల్ వస్త్రాలు అందించడం సంతోషదాయకమన్నారు. విజయనగరం ప్రజల ఆదరణ మర్చిపోలేనిదన్నారు. రాబిన్ హుడ్ చిత్రంలో తన పాత్ర విభిన్నంగా ఉంటుందని తెలిపారు. చిన్నవయసులోనే క్రేజీ ఉన్న హీరోలతో కలిసి నటించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం షాపింగ్ మాల్ బయట అభిమానులద్దేశించి కాసేపు మాట్లాడారు. వారితో కలిసి సెల్ఫీలు దిగారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ జిల్లా వాసులందరికీ అన్ని రకాల వస్త్రశ్రేణి ఇక్కడ అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నాయన్నారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీస్‌లు బందోబస్తు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో వస్త్ర దుకాణ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభిమానులతో సెల్ఫీలు తీసుకుంటూ...



అభిమాన నటితో సెల్ఫీదిగిన ఆనందంలో యువత

కేసుల రాజీలో అద్వితీయం

- జాతీయలోక్ అదాలత్‌లో జిల్లాలో 5,345 కేసుల పరిష్కారం
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండో స్థానం
- కేసుల పరిష్కారంలో కీలక భూమిక పోషించిన జిల్లా పోలీస్ శాఖ
- ఎస్పీ వకుల్‌జిందాల్, పోలీసులను అభినందించిన డీజీపీ



విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

విజయనగరం క్రైమ్: జాతీయలోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర డీజీపీ నుంచి ప్రశంసలు లభించాయి. కేసులు రాజీ కుదర్చడంలో రాష్ట్రస్థాయిలోనే విజయనగరం ద్వితీయ స్థానంలో నిలిచింది. 5,345 కేసులను రాజీ కుదర్చడంలో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్పీ వకుల్ జిందాల్‌తో పాటు భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, డీసీఆర్‌బీ ఎస్ఐ కె.రాజేష్, నెల్లిమర్ల హెచ్‌సీ కె.సన్యాసినాయుడు, టూటౌన్ కానిస్టేబుల్ ఐ.శ్రీనివాసరావును రాష్ట్ర డీజీపీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అర్హత కలిగిన కేసులను ముందుగా గుర్తించి, ఆయా కేసుల్లో ఫిర్యాదిదారులు, కక్షిదారుల మధ్య సమన్వయం సాధించేందుకు క్షేత్రస్థాయిలో చక్కని ప్రణాళికతో పనిచేశామన్నారు. న్యాయస్థానాల విలువైన సమయాన్ని ఆదా చేయడంతో పాటు స్వల్ప వివాదాలు, క్షణికావేశంపై నమోదైన కేసుల్లో ఇరువర్గాలను డిసెంబర్ 14న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టడం, న్యాయస్థానం ముందు హాజరై, ఇరువర్గాలు రాజీపడినట్లుగా చేయడంతో అధిక కేసులు పరిష్కరించగలిగామన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లుగా నమోదైన 1192 కేసులతో సహా 4,153 ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను పరిష్కరించామని వివరించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని, జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 17,138 కేసులు డిస్పోజల్ కాగా, వాటిలో విజయనగరం జిల్లా పోలీసులు 5,345 కేసులను డిస్పోజ్ చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానంలో కర్నూల్, తృతీయస్థానంలో కృష్ణా జిల్లాలు నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ అడిషనల్ డీజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, లా అండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్, రైల్వే, స్పోర్ట్స్ ఐజీ కె.వి.మోహనరావు, ఈగల్ ఐజీ రవికృష్ణ, ఇతర జిల్లాల ఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



గంట్యాడ మండలం నరవలో పొలంలో ఉన్న ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు



బొండపల్లి మండలం రాచకిండాంలో వరి కుప్పలు తడిచిపోకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు



బొండపల్లి మండలం బోడసింగిపేటలో వరి పనలను కుప్పగా చేర్చడంలో రైతన్నకు సాయం చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

రైతన్నల్లో తుఫాన్ వణుకు



బాడంగి మండలం ముగడలో ట్రాక్టర్‌కు పెసర చేనును లోడ్‌చేస్తున్న రైతులు



రామభద్రపురంలో క్యాబేజీ పంట సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి పి.మోహనకృష్ణ

వరుసగా సంభవిస్తున్న తుఫాన్‌లు రైతన్న నడ్డివిరుస్తున్నాయి. పదిరోజుల కిందట వచ్చిన ఫెంగల్ తుఫాన్ వేలఎకరాల్లోని వరి పంటను తడిపేసి నష్టం చేకూర్చింది. సుమారు 1934 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగుమారింది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతుల్లో వణుకుపుట్టిస్తోంది. బుధవారం చిరుజల్లులు కురవడంతో రైతు కుటుంబాలు పొలానికి పరుగుతీశాయి. పనలుగా ఉన్న చేనును కుప్పలుగా చేర్చాయి. నూర్పిడి చేసిన ధాన్యంను భద్రపరిచే చర్యలు చేపట్టాయి. కొన్నిచోట్ల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతన్నలను అప్రమత్తం చేశారు. పనుల్లో భాగస్వాములయ్యారు. వరితో పాటు కూరగాయల పంటల సంరక్షణపై సూచనలిచ్చారు.

– విజయనగరంఫోర్ట్/తెర్లాం/సంతకవిటి/బొండపల్లి/బాడంగి



తెర్లాంలో ధాన్యాన్ని ట్రాక్టర్‌పై సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతు

రైతుల భూ సమస్యలు పరిష్కరించండి

గుర్ల: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. గుర్ల మండలం దేవునికణపాకలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించారు. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూములకు పట్టాలు అందజేయాలని, గతంలో ఇచ్చిన పట్టాలకు భూములను చూపాలని కలెక్టర్‌కు గిరిజనులు విన్నవించారు. సమస్యపై వారం రోజుల్లో పూర్తి సమాచారం అందించాలని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. సదస్సులో ఏఓ తిరుపతిరావు, డీటీ నారాయణమ్మ, సర్వేయర్ శివ, ఆర్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు భూ సమస్యను వివరిస్తున్న రైతు

క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన పైడిరాజు



పతకాలతో పైడిరాజు

సాలూరు రూరల్: ఈ నెల 14,15 తేదీలలో గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొన్న సాలూరు మండలంలోని మామిడిపల్లికి చెందిన పైడిరాజు 800 మీటర్లు, 400మీటర్లు, 400 రిలే పరుగుపందెంలో సత్తాచాటి బంగారు పతకాలు సాధించినట్లు పీఈటీ శ్రీరాములు తెలిపారు. ఆమె గీతం యూనివర్సిటీ డెంటల్ కళాశాలలో ఏఎస్ఎంగా పనిచేస్తున్నారు. ఆమె విజయం పట్ల మామిడిపల్లి గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

బొండపల్లి: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి26పై బుధవారం ఉదయం ద్విచక్రవాహన చోదకుడిని కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి తన వివరాలు చెప్పలేని పరిస్థితిలో ఉండడంతో గజపతినగరంలోని సీహెచ్‌సీకి ఎస్సై యు.మహేష్ తరలించి చికిత్స అందిస్తున్నారు.

వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా సూర్యోదయానికి ముందు ప్రాతఃకాలార్చన, బాల భోగం, శ్రీ గోదాదేవి పల్లకిసేవ, తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం జరిపించి, రామాయణంలో పట్టాభిషేక సర్గ హవనం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామానికి చెందిన ఆమిటి సతీష్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కు పెళ్లై 14సంవత్సరాలైంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి అలవాటు పడడంతో ఎప్పటికప్పుడు భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో భార్య 5సంవత్సరాల నుంచి పిల్లలతో కన్నవారింట్లో ఉంటోంది. ఎన్నిసార్లు కబురు పంపినా, పెద్దలతో పిలిపించినా నోటీసులు ఇచ్చినా ఆమె రాలేదు. దీంతో మనస్తాపం చెంది మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటిమేడపైకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా రు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పార్వతీపురం కోర్టు మేజిస్ట్రేట్ సమక్షంలో వాంగ్మూలం తీసుకుని వివరాలు నమోదు చేసినట్లు అవుట్‌పోస్టు ఏఎస్సై నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

బైక్ బోల్తా పడి మహిళ మృతి

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి బైక్ బోల్తా పడి ఓ మహిళ మృతిచెందింది. ఈ మేరకు ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం కాశీపేటకు చెందిన దుప్పాడ ఉషారాణి(49)తన కుమారుడు అజయ్‌చందుతో కలిసి దత్తిరాజేరు మండలంలోని మరడాంలో బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పాత బొబ్బిలి వద్ద ఉన్న రోడ్డుపై గుంతల వద్ద బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన ఉషారాణిని బొబ్బిలి సీహెచ్‌సీకి అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

నిరుద్యోగులపై కక్ష తగునా..!

- గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ భర్తీలో జాప్యం
- తీవ్రఆందోళనలో అభ్యర్థులు
- కాలయాపన చేస్తున్న అధికారులు



విజయనగరం ఫోర్ట్:

అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు ఇప్పిస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడు చెప్పిన మాటల ఊసే ఎత్తడం లేదు. కొత్త ఉద్యోగాలు మాట దేవుడు ఎరుగు. భర్తీ చేయాల్సిన పోస్టులకు కూడా దిక్కు లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో నోటిఫికేషన్ ఇచ్చారనే అక్కసుతో కూటమి ప్రభుత్వం ఆ పోస్టులు భర్తీ చేయకుండా జాప్యం చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాలకు దరఖాస్తు చేసినవారు ఏ పార్టీకి చెందినవారూ కాకపోయినప్పటికీ వారి పట్ల కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా నోటిఫికేషన్ ఇస్తే నెల, రెండు నెలల్లోగా భర్తీ చేస్తారు. ఏడాది అయినా సరే పోస్టులు భర్తీ చేయలేదు. తమ పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికీ వారి గోడు పట్టించుకునే వారే కరువయ్యారు.

2023 నవంబర్‌లో నోటిఫికేషన్

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. వైద్యరంగ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జీరో వెకెన్సీ పాలసీని తీసుకొచ్చి ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసింది. దీంతో సిబ్బంది కొరత ఎక్కడా కనిపించేది కాదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పడిన ఖాళీల భర్తీకి 2023 నవంబర్ 9 వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చారు. 20 కేటగిరిలకు సంబంధించి 63 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా 1000 మంది వరకు అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్నారు. వాటిలో కొన్ని పోస్టులకు ఫైనల్ మెరిట్ లిస్టు కూడా ప్రకటించారు. మరికొన్ని పోస్టులకు ప్రొవిజినల్, మెరిట్ జాబితాను ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పోస్టుల భర్తీ పక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అనంతరం భర్తీ పక్రియ చేపట్టాల్సి అధికారులు ఇప్పటివరకు చేపట్టకుండా తీవ్ర జాప్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టుల భర్తీని అడ్డుకున్న అధికారి

అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న ఓ అధికారి పోస్టులు భర్తీ చేయకుండా అడ్డుకున్నారనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం నవంబర్ 30 వతేదిలోగా పోస్టులను భర్తీ చేసుకోవాలని అనుమతి ఇచ్చినప్పటికీ సదరు అధికారి పోస్టుల భర్తీ చేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 30 వతేదీ లోగా పోస్టులు భర్తీ చేయడానికి వైద్య కళాశాల అధికారులు ప్రాసెస్ నిర్వహించినప్పటికీ సదరు అధికారి అడ్డుపుల్ల వేసినట్లు సమాచారం. నోటిఫికేషన్ కాలపరిమితి ముగిసిందని అధికారులు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కొత్తగా నోటిఫికేషన్ వస్తే తమకు ఉద్యోగం వస్తుందో, రాదోనని ఆవేదన చెందుతున్నారు. నిరుద్యోగులకు మేలు చేస్తారని కూటమికి సర్కార్‌ను గద్దె నెక్కిస్తే తీవ్ర అన్యాయం చేస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.

ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో ప్రథమస్థానం



ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు ఎంపిక చేసినఫైనల్ మెరిట్ జాబితాలో ప్రథమ స్థానంలో ఉన్నాను. ఆరు నెలలుగా వైద్య కళాశాల అధికారులను పోస్టులు భర్తీ ఎప్పుడు చేస్తారని అడుగుతున్నాం. నిన్నటి మొన్నటివరకు చేస్తామని చెప్పారు. దీంతో ఉద్యోగం వస్తుందని గంపెడాశలు పెట్టుకున్నాం. ఇప్పుడు కొత్తగా నోటిఫికేషన్ ఇస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

శంకరావు మణికంత, ఆఫీస్ సబార్డినేట్ అభ్యర్థి

కొత్తగా నోటిఫికేషన్ ఇస్తే మా పరిస్థితి ఏంటి ?



ఎలక్ట్రికల్ హెల్పర్ పోస్టులో ప్రథమ స్థానంలో ఉన్నాను. ఇప్పుడు ఆ నోటిఫికేషన్ కాదని మళ్లీ నోటిఫికేషన్ ఇస్తే నా పరిస్థితి ఏంటి. ఉద్యోగం వస్తుందని ఏడాది నుంచి ఆశగా ఎదురు చూస్తున్నాను. ఇది చాలా అన్యాయం.

ఎస్.ధనుంజయనాయుడు, ఎలక్ట్రికల్ హెల్పర్ అభ్యర్థి

ల్యాబ్ అటెండెంట్ పోస్టుజాబితాలో ఫస్ట్ పేరు



ల్యాబ్ అటెండెంట్ జాబితాలో ఫస్ట్ పేరు నాదే. ఉద్యోగం వచ్చేసినట్లేనని సంబరపడ్డాను. నోటిఫికేషన్ ఇచ్చి ఏడాది అయినా అధికారులు భర్తీ చేయలేదు. నిన్న మొన్నటి వరకు వైద్య కళాశాల అధికారులు భర్తీ చేస్తామంటూ చెప్పుకొచ్చారు. ఇప్పుడు నోటిఫికేషన్ కాలపరిమితి అయిపోయిందని అంటున్నారు. ఉద్యోగానికి వయోపరిమితి కూడా అయిపోతోంది. ఇప్పుడు నా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

షేక్ రెహమాన్, ల్యాబ్ అటెండెంట్ అభ్యర్థి

నోటిఫికేషన్ కాలపరిమితి దాటింది



20 కేటగిరిలలో 63 పోస్టులకు సంబంధించి 2023 నవంబర్ నెలలో ఇచ్చిన నోటిఫికేషన్ కాలపరిమితి 2024 నవంబర్‌తో ముగిసింది. దీంతో మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని డీఎంఈకు ప్రతిపాదనలు పంపించాం.అనుమతి రాగానే నోటిఫికేషన్ ఇస్తాం.

డాక్టర్ పద్మలీల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

మాంగనీస్ అక్రమ తవ్వకాలపై దాడులు

- పొక్లెయిన్, ట్రాక్టర్ సీజ్



మైనింగ్ తవ్వకాల వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు



అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

రాజాం: మండల పరిధిలో గార్రాజు చీపురుపల్లి గ్రామం పరిసర ప్రాంతాల్లోని జీడి తోటల్లో విజయనగరం రీజనల్ మైనింగ్ అధికారి బి.ప్రసాదరావుతో పాటు సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో మాంగనీస్ ఖనిజం అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం రెవెన్యూ అధికారులతో కలిసి మైనింగ్ చేస్తున్న ప్రాంతం వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాంగనీస్ రాళ్లు తవ్వుతున్న పొక్లెయిన్‌తో పాటు రవాణాకు సిద్ధం చేసిన ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ఈ మైనింగ్‌ను చింతగుంటి ఢిల్లీశ్వరరావు, తోట జోసెఫ్, బూరాడ సురేష్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, వారిపై రాజాం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశామని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రీజనల్ ఆఫీసర్ ప్రసాదరావు మాట్లాడుతూ మాంగనీస్ ఖనిజాన్ని ఎవరైనా అక్రమంగా తవ్వడం, తరలించడం చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. నిరంతరం ఈ కార్యక్రమాలపై నిఘా పెట్టామని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ డి.సతీష్‌కుమార్, ఏజీ ఎం.సురేష్‌కుమార్, జిల్లా గనులు, భూగర్భశాఖ డీడీ సి.మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజలనుంచి వచ్చిన అర్జీలపై అశ్రద్ధ చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు, పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను స్థానికంగానే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలోనే ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌ను విధిగా నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సక్రమంగా సరుకులు పంపిణీ చేయకపోతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుని తొలగించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, సంచుల కొరతలేకుండా చూడాలని చెప్పారు. గృహ నిర్మాణాల పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్‌లు ఇవ్వాలని తెలిపారు. జియ్యమ్మవలస మండలంలో పీఎం జన్‌మన్ ప్రగతి మందగమనంలో ఉండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెల కనీసం 500 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అధికారి వీఎస్.నగేష్ బాబు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ తదితరులున్నారు.

కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాచిపెంట మండలం శతాబి వద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలున్నాయని, పొలం గట్లుపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కూరగాయల విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. జనవరి నుంచి రైతు అవగాహన సదస్సులను నిర్వహించాలని, ఉద్యాన పంటలలో 15 శాతం వృద్ధి ఉండేలా ప్రణాళికలు చేయాలని తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు రుణాలను మంజూరు చేయాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటుకు, మత్స్య ఉత్పాదక సంస్థ ఆధ్వర్యంలో మత్స్య ఆహార యూనిట్లును ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగర వనం, నగర వాటిక అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జీఏపీ.ప్రసూన, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి మన్మథరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తదితర శాఖాధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యుత్ ఉద్యోగులకు పతకాలు



మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యుత్ ఉద్యోగులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్‌కు చెందిన ఉద్యోగులు సత్తా చాటారు. ఇటీవల గుడివాడలో జరిగిన పోటీల్లో వివిధ అంశాల్లో పతకాలు దక్కించుకుని ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో పాల్గొన్న పోలిపల్లి పైడిరాజు లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పోటీల్లో కాంస్యం, 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో రజత పతకం, 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మరో రజత పతకం సాధించారు. అలాగే ఎ.రామకృష్ణ 1500 మీటర్ల పరుగు పోటీల్లో రజత పతకం 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో కాంస్య పతకతం దక్కించుకున్నారు. ఇవే పోటీల్లో పి.అనిల్ కుమార్ 200 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకగా..400 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పోటీలో రజత పతకం సాధించారు. రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన ముగ్గురు ఉద్యోగులను ఆపరేషన్ సర్కిల్ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల ఉరవకొండలో జరిగిన సబ్‌జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొన్న గంట్యాడ కేజీబీవీలో చదువుతున్న కుమ్మరి అశ్విని, గండిమాని పవిత్రలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఇద్దరు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, సెపక్‌తక్రా జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయినులు పి.భవాని, డి.సీతలు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభా పాటవాలు కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

ముక్కాంలో ముందుకొచ్చిన సముద్రం



ముందుకు వచ్చిన సముద్రం

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని భోగాపురం మండలం ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం సముద్రతీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది. ముక్కాం, చేపలకంచేరు మధ్య బుధవారం 50 మీటర్ల మేర సముద్రం ముందుకువచ్చింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో రెవెన్యూ, మెరైన్ మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించారు.

నేడు సీనియర్స్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 19న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి నగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపిక పోటీల్లో 18 సంవత్సరాలు వయస్సు నిండి ఎఫ్ఏఐ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. జిల్లాస్థాయి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్ 83747 37707 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు పీపీ వావా



కార్మికులతో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.పీపీ వావా

పార్వతీపురం: సఫాయి కర్మచారి (పారిశుద్ధ్య కార్మికులు)లకు పునరావాసం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.పీపీ వావా అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సఫాయి కార్మికులకు పునరావాసం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని సూచించారు. ష్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. సఫాయి కర్మచారీల కుటుంబసభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సఫాయీ కర్మచారి ప్రమాదశాత్తు మృతిచెందితే తక్షణం కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల ఆదాయాలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులను మంజూరుచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్, డీపీఓ టి.కొండలరావు, డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా కార్మిక శాఖాధికారి కె.రామకృష్ణారావు, డీడీఓ రమేష్ రామన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరాజు, సర్వేశ్వరరావు తదితరులున్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ నేడు

విజయనగరం: జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలతో పాటు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.మాణిక్యంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017వ సంవత్సరం అనంతరం మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న తెలుగు విభాగంలో 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను, కార్పొరేషన్ పరిధిలో సోషల్ విభాగంలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ 3 పోస్టులను భర్తీ చేసేందుకు ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు వారి సేవా పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో పండించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా విధానాలను రుపొందించాలని కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పండించే వరి, మామిడి, మొక్కజొన్న వంటి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ఆధారం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై జనవరి మొదటి వారంలో పారిశ్రామిక సదస్సు నిర్వహించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తల్లో అవగాహన కలిగించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి

జిల్లాలోని చింతపల్లి, చేపల కంచేరు, ముక్కాం బీచ్‌లలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ మత్స్యశాఖ డీడీని ఆదేశించారు. ఈ మేరకు ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బీచ్‌లు ఉన్నాయని, ఆదివారాలు, మరి కొన్ని ప్రత్యేక రోజుల్లో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారని, ఆ బీచ్‌ల వద్ద గజ ఈతగాళ్ల ఉండాల్సిన అవసరం ఉందని మెరైన్ ఎస్పీ రవివర్మ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కలెక్టర్ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చెల్లించేందుకు అవకాశం ఉందని, నెలలో నాలుగు రోజులు బీచ్‌ల వద్ద పనిచేయడానికి గజ ఈతగాళ్లను గుర్తించాలని సూచించారు. సమావేశంలో మెరైన్ అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, డీపీఓ వెంకటేశ్వర రావు, మత్స్యశాఖ డీడీ నేతల నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మెడికవర్ ఫ్యామిలీ కార్డ్‌ను ప్రారంభించిన కలెక్టర్

తిరుమల మెడికవర్ ఆస్పత్రి వారు అందించే వైద్య సేవలకు సంబంధించిన ఫ్యామిలీ కార్డును కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ బుధవారం ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ రూ.500తో ఏడాది పాటు ఐదుగురు సభ్యులు వైద్యసేవలు పొందవచ్చన్నారర. ఓపీ సంప్రదింపులపై 25 శాతం, ఓపీ పరిశోధనలపై 15 శాతం, నగదు ప్రవేశాల కోసం ఐపీ, డేకేర్ సేవలపై 10 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. బీమా రోగులకు వైద్యేతర సేవలపై 50 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. రూ.5 వేల కంటే ఎక్కువ ఉన్న ఫార్మసీ బిల్లుపై 20 శాతం తగ్గింపు ఉంటుందని వివరించారు.